

నేడు నెలగంటు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వైభవం సందర్భంగా సోమవారం నెలగంటు పెట్టనున్నారు. ధనుర్మాస ఉత్సవాలతో పాటు సంక్రాంతి సందడి మొదలుకానుంది. ఈ నెల 16నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తారు. వైష్ణవ ఆలయాల్లో పూజలు చేస్తారు. శ్రీకాకు ళంలోని నారాయణ తిరుమల, శివబాలాజీ, శ్రీకళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో నెలరోజుల పాటు తిరుప్పావై శాంతమలై, మంగళ శాసనాలు నిర్వహిస్తారు. వచ్చే నెల 3న దీపోత్సవం, 8న ముత్యాల హారతులు, 10న ఉత్తరద్వార దర్శనం 11న కూడారై ఉత్సవం, 13న గోదా రంగనాథుల కళ్యాణం నిర్వహిస్తారు.

భూములున్నా.. హక్కు ఏదీ?

- ప్రభుత్వ పథకాలకు దూరం
- బ్యాంకు రుణాలు సైతం అందని వైనం
- ఏళ్ల తరబడి పరిష్కారం కాని 'ఈనాం' ఇక్కట్లు
- రైతులకు తప్పని ఇబ్బందులు



పాతమారడికోటలో ఈనాం భూములు



- మెళియాపుట్టి మండలం కొత్తమారడికోట గ్రామానికి చెందిన పెద్దింటి సీతమ్మకు 4 ఎకరాల మెట్టు, 1.60 ఎకరాల పల్లం భూమి ఉంది. అయితే వెబ్‌ల్యాండ్‌లో మాత్రం పల్లం 4000 ఎకరాలు, మెట్టు భూమి 400 ఎకరాలు ఉన్నట్టు నమోదైంది. దీంతో గత ఐదేళ్లుగా ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతోంది.
- మెళియాపుట్టి మండలం పాతమారడికోట గ్రామానికి చెందిన నందిగాం వజ్రమ్మకు పల్లం భూమి 60 సెంట్లు మాత్రమే ఉంది. కానీ 2,502 ఎకరాల భూమి ఉన్నట్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదుకావడంతో.. తనకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని వజ్రమ్మ వాపోతోంది. భూములున్నా.. వాటిపై హక్కు లేకపోవడంతో అత్యవసర సమయంలో విక్రయించుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

మెళియాపుట్టి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

..ఇలా మెళియాపుట్టి, నందిగాం మండలాల్లో చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనాం భూములు కావడమే ఇందుకు కారణం. భూమి వారిదే. తరతరాలుగా సాగు చేస్తున్నారు. ప్రతిఫలం అనుభవిస్తున్నారు. కానీ భూమిపై ఎటువంటి హక్కులు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. మెళియాపుట్టి మండలంలోని పాతమారడి కోట, కొత్తమారడికోట, జీడిపాలెం, పాత్రలోవతోపాటు నందిగాం మండలంలో అన్నాపురం, తమలాపురం గ్రామంలో 30 మంది రైతులు ఈనాం భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. 200 ఏళ్ల కిందట అప్పటి జమీందార్లు రుణంగా ఇచ్చిన వాటిని అగ్రహారాలు అని పిలుస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఆరుగ్రామాల పరిధిలో సుమారు 110 ఎకరాల్లో 30 మంది రైతులు తరతరాలుగా సాగు చేస్తున్నా.. ఆ భూములపై హక్కులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించగా.. అప్పటి తహసీల్దార్ పి.సరోజిని స్పందించారు. ఈ విషయాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో అప్పటి టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఈనాం, సాగు చేసిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు సర్వే చేసి వదిలేశారు. తర్వాత దీనిపై స్పందన లేదని రైతులు పేర్కొంటున్నారు. తరతరాలు నుంచి సాగు చేస్తున్నా.. తమకు బ్యాంకు రుణాలు సైతం అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు డబ్బులు అత్యవసరమైనా భూములు అమ్ముకోలేని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. ఈ భూములపై హక్కులు లేకపోవడంతో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోతున్నారు. అలాగే ఆన్‌లైన్ అడంగల్ లేకపోవడంతో ఈ-క్రాప్ నమోదు కావడం లేదు. తద్వారా పంటల బీమా పొందక.. పండించిన పంట విక్రయించలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తుఫాన్‌లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టం వాటిల్లినా పరిహారం దక్కడం లేదని నిట్టూర్చుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పరిష్కారం చూపాలి..



దశాబ్ద కాలంగా ఇనాం భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసి వదిలేసింది. తరతరాలుగా వెంటాడుతున్న ఈ సమస్యకు కూటమి ప్రభుత్వమే పరిష్కారం చూపాలి.


-రామినాయుడు, కొత్తమారడికోట, ఈనాం రైతు

పథకాలకు దూరమౌతున్నాం..



ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నాం. కొంతమంది రైతులకు వెబ్‌ల్యాండ్‌లో అధికంగా భూములు ఉన్నట్టు చూపిస్తుండడంతో పథకాలు అందడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

-ఇప్పిలి కృష్ణారావు, ఈనాం రైతు



పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో.. ముందుకు సాగుదాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అహింస, హరిజనోద్ధరణ కోసం పనిచేసిన ఆ మహనీయుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను ధారపోసిన ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి వేరు చేసి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని కోరుతూ స్వర్గీయ పొట్టి శ్రీరాములు సాగించిన మహత్తర పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడదగ్గదన్నారు. ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎస్ఓ సూర్య ప్రకాష్, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం వద్ద జాతీయ రహదారి

హైవే విస్తరణ ఎప్పుడో?

- ఆనందపురం - నరసన్నపేట పూర్తి
- నరసన్నపేట - ఇచ్ఛాపురం పెండింగ్
- జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- ఆందోళనలో ప్రజలు
- కేంద్రమంత్రి చొరవతో చిగురిస్తున్న ఆశలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 197 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. కానీ వాహనాలు, అవసరాలకు తగ్గట్టు హైవే విస్తరణకు నోచుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించారు. కానీ నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ విస్తరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదిగోఇదిగో అంటూ గత ఐదేళ్లుగా కాలయాపన జరిగింది. ఇటీవల కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఈ సమస్యపై విన్నవించడంతో హైవే విస్తరణపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఇదీ.. జరిగింది

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విశాఖ జిల్లా ఆనందపురం వరకూ 211 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీనిని 2016లో మూడు విభాగాలుగా విభజించి పనులు చేయాలని అప్పటి ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకుగాను రూ.3,348కోట్లు మంజూరు చేసింది. ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేట వరకూ 110 కిలోమీటర్లకుగాను రూ.444 కోట్లు, నరసన్నపేట నుంచి రణస్థలం వరకూ 54 కిలోమీటర్లకుగాను రూ.1665 కోట్లు, రణస్థలం నుంచి ఆనందపురం వరకూ 47 కిలోమీటర్లకుగాను రూ.1239 కోట్లు కేటాయించారు. విశాఖ నుంచి నరసన్నపేట వరకూ ఆరులేన్ల రహదారి పనులు 2022లోనే పూర్తయ్యాయి. కానీ నరసన్నపేట మండలం తామరాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకూ 110 కిలోమీటర్ల విస్తరణ పనులు మాత్రం ఇంకా చేయాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఆరులేన్ల విస్తరణ పనులు జరిగినా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదు. ఇప్పుడు ఆ రోడ్డుపై ట్రాఫిక్ లేదన్న సాకు చూపుతున్నారు.

ఆ 17 చోట్ల వంతెనలు..

జిల్లాలో జాతీయ రహదారిపై 57 ప్రమాద స్పాట్‌లు ఉన్నాయని, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల్లోపు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. సర్వీసు రోడ్ల ప్రారంభం, ముగింపుల వద్ద చిన్నపాటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడంతో వాహనదారులు వాటిని గుర్తించడం లేదు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా నరసన్నపేట-ఇచ్ఛాపురం మధ్య 17 చోట్ల వంతెనలు నిర్మించాల్సి ఉంది. లొద్దపుట్టి, ఈదుపురం, పద్మతుల, మకరాంపురం, బైపల్లి పుట్టుగ, బూరగాం, మామిడిపల్లి, సున్నాదేవి, కొబ్బరిపూరు, నీలావతి, మాకన్నపల్లి, రామకృష్ణాపురం జంక్షన్, కొత్త అగ్రహారం, లట్టిగాం, సుభద్రాపురం, టెక్కలి ఆది ఆంధ్రావీధి, పాకివలస, శ్రీజగన్నాథపురం కూడలి, గట్లపాడు, జడూరు జంక్షన్, తామ రాపల్లిలో వంతెనలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీలైనంత త్వరగా జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు..



జాతీయ రహదారి విస్తరణ పనులు జరగక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విశాఖ జిల్లా ఆనందపురం నుంచి నరసన్నపేట వరకూ విస్తరించారు. కానీ నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ విస్మరించడం దారుణం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

- కాళ్ల జయదేవ్, టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, ఇచ్ఛాపురం

మాట తప్పారు..



నరసన్నపేట నుంచి విశాఖ పట్నం ప్రయాణం చాలా సులువుగా జరుగుతోంది. కానీ నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం రావాలంటే మాత్రం ఇబ్బందిగా మారుతోంది. జిల్లాలోని హైవేలో ప్రధాన భాగాన్ని విస్తరించకుండా వదిలేశారు. ఆ రెండు విభాగాలతో పాటు ఇచ్ఛాపురం-నరసన్నపేట మధ్య రోడ్డు విస్తరణ చేపడతామని చెప్పి మాట తప్పారు.

- రెయ్యి జానకిరావు, 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి, ఇచ్ఛాపురం

కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాం..



నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ జాతీయ రహదారి ఆరు లేన్లుగా మారుతుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఈ సమస్యను పరిష్కరించాలని ఇటీవల కేంద్రరవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకు విజ్ఞప్తి చేశాం. త్వరలో విస్తరణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

- కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్రమంత్రి

30 నుంచి శారీరక దారుఢ్య పరీక్షలు

ఎచ్చెర్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో భాగంగా శారీరక దారుఢ్య పరీక్షలు ఈ నెల 30నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. 100మీటర్లు, 1600 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్‌నకు సంబంధించి ట్రాక్‌లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఏపీ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంటు బోర్డు స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుల్స్ (సివిల్), పోలీసు కానిస్టేబుల్స్ (ఏపీ ఎస్పీ) నియామకం కోసం శారీరక దారుఢ్య పరీక్షలకు ఇబ్బంది ల్లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులకు అవసరమైతే ప్రాథమిక చికిత్సకు వైద్యులు, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

మింగేసిన రాకాసి అల

- రట్టి తీరంలో యువకుడి మృతి
- మృతుడి స్వస్థలం రాజస్థాన్ జోధ్‌పూర్
- హరిపురంలో విషాదఛాయలు

హరిపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అందరితోనూ కలివిడిగా ఉంటూ చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆ యువకుడ్ని అల రూపంలో మృత్యువు మింగేసింది. రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన మహావీర్‌సేన్(26).. మందస మండలం హరిపురంలోని తన అక్క వద్ద ఉంటూ జిలేబీ, సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రట్టి సముద్రతీరానికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. సముద్రంలో స్నానానికి దిగిన ఐదు నిమిషాల్లోనే అలల్లో చిక్కుకుని గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ ఆయన ఆచూకీ కోసం వెతికారు. మందస పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో కలసి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం మూడు గంటల సమయంలో తీరంలో తేలియాడుతూ కొట్టుకొస్తున్న మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. దీంతో తీరంలో బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. హరిపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహావీర్‌సేన్ మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న పోలీసులు

ఆదిత్యుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత.. అరసవిల్లి శ్రీ సూర్య నారాయణ స్వామిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజే స్వామికి రూ.4,66,506 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,80,000, విరాళాల ద్వారా రూ.70,436, ప్రసాదాల ద్వారా రూ.2,16,070ల ఆదాయం లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.



ఆదిత్యాలయంలోని క్యూలో భక్తుల రద్దీ



కేసముద్రంలోని ఎంకే కన్వెన్షన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

'తెలుగు' రాజకీయాలను శాసించేది కాపులే!

▸ పార్టీలు వేరైనా కాపులంతా కలిసికట్టుగా ఉండాలి: గంటా

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల రాజకీయాలను శాసించే శక్తి ఒక్క మున్నూరు కాపులకే ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమినాపురంలో మూన్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎంకే కన్వెన్షన్‌ను సంఘం అధ్యక్షుడు చందా గోపితో కలిసి గంటా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని కాపుల్లో రకరకాల పేర్లతో విభజించి ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని, అన్ని రకాల కాపులు ఒక్కటేనని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా మున్నూరుకాపులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఇక్కడి కన్వెన్షన్ హాల్‌కు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు.

జమిలి మంచిదే: కేంద్ర మంత్రి పెమ్మసాని

పెదకాకాని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు పెట్టడం మంచిదేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అయితే జమిలి ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వీవీఐటీ కళాశాల ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా చెప్తే ఆ విధంగా నడుచుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం పార్లమెంట్లో చట్టం చేయబోతోందని, దానిని అందరూ ఆమోదించాల్సి ఉందని చెప్పారు.

అల్లు అర్జున్‌కు జగన్ వత్తాసు నీచాతినీచం

▸ సీపీఐ రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్.. సినీ హీరో అల్లు అర్జున్‌కు వత్తాసుగా మాట్లాడటం నీచాతినీచమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఓట్ల కోసం రాజకీయ నేతలు సినిమా హీరోలకు ఊడిగం చేయడం సిగ్గుచేటన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనలో కనీస మానవత్వంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రూ.వందల కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్న సినిమా హీరోకి జగన్, బండి సంజయ్ వత్తాసు పలకడం సిగ్గుచేటు. పుష్ప-2 సినిమా టిక్కెట్ ధర రూ.1200లకు పెంచడం దారుణం. అని రామకృష్ణ వివరించారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

యూనివర్సిటీలకు వెంటనే వీసీలను నియమించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంకా ఉన్నత విద్యామండలికి చైర్మన్‌ను నియమించలేదని పేర్కొన్నారు. 4,439 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ మధ్యలోనే ఆగిపోయిందన్నారు.

అల్లుడూ ఎలా ఉన్నావ్?.. అర్జున్‌కు చిరంజీవి పలకరింపు

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో శనివారం జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. తన మామ, సినీనటుడు చిరంజీవిని ఆదివారం కలిశారు. భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హతో కలిసి ఆదివారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లారు. మరో కారులో అల్లు అరవింద్ వారిని అనుసరించారు. కాగా, చాలాకాలం తర్వాత తమ ఇంటికి వచ్చిన అల్లు అర్జున్‌ను చిరంజీవి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. 'అల్లుడూ ఎలా ఉన్నావ్' అని అడుగుతూ చిరంజీవి ఆలింగనం చేసుకున్నారు.

రాష్ట్రంలో సాహితీ పర్యాటకం..!

▸ తెలుగు భాష అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

▸ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం, చారిత్రక స్థలాల పర్యాటకం ఉన్న మాదిరిగానే సాహితీ పర్యాటకం కూడా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆదివారమిక్కడ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు ఆయన్ను కలిశారు. 35 ఏళ్ల నుంచి విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెబుతూ అందుకు సంబంధించిన వివరాలను వారు తెలియజేశారు. కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవం నిర్వహణకు అవసరమైన స్థలం లేక ఇబ్బందులుపడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, అక్కడ వారి జ్ఞాపకాలను కాపాడడం.. వారి సాహిత్య సేవలు తెలిపే స్మారక కేంద్రాల నిర్మాణం వంటి వాటి ద్వారా ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. మాతృ భాషపై నవతరంలోనూ, చిన్నారుల్లోనూ ప్రేమాభిమానాలు పెంచడంతో పాటు మన కవులు, రచయితల గొప్పదనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. 'వేటపాలెం గ్రంథాలయం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సి.పి.బ్రౌన్ గ్రంథాలయం లాంటి ప్రముఖ గ్రంథాలయాలు ఏపీలో ఉన్నాయి. వీటిని, కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశంపై భాషా, సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. ఆయన్ను కలిసినవారిలో బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు టి.మనోహర్ నాయుడు, కె.లక్ష్మయ్య, గొల్లనారాయణరావు, సాందీపని ఉన్నారు.



విజయవాడలో జరగనున్న బుక్ ఫెస్టివల్‌కు రావాలని కోరుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం అందిస్తున్న బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు

తప్పు నాదే.. క్షమించండి

▸ జర్నలిస్టు రంజిత్‌తో మోహన్ బాబు

▸ కొడుకు విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీనటుడు మోహన్ బాబు తన తప్పును అంగీకరించారు. బాధిత జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబ సభ్యులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. జల్‌పల్లిలోని తన నివాసం వద్ద తాను చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు ఆదివారం పరామర్శించారు. తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఆయన.. బాధిత జర్నలిస్టుకు క్షమాపణ చెప్పారు. రంజిత్ కుమార్తె, ఇతర కుటుంబసభ్యులకు కూడా క్షమాపణలు తెలియజేశారు. ఆ రోజు జరిగిన ఘటనకు తాను బాధపడుతున్నానని, అలా జరిగి ఉండాల్సింది కాదని, తప్పు తనదేనని రంజిత్‌తో అన్నారు. క్షమించమని అడగడం తప్ప.. ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని రంజిత్, అతని భార్యాపిల్లలకు వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, రంజిత్ కుమార్తెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. సారీ తల్లి నా వల్లే మీ నాన్నకు ఈ పరిస్థితి వచ్చిందని ఆ చిన్నారితో అన్నారు. అనంతరం, రంజిత్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి.. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు కాళ్లు, భుజాలు, కళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న తనకు... శస్త్రచికిత్సల బాధ ఎలా ఉంటుందో తెలుసునని ఈ సందర్భంగా వారితో అన్నారు. రంజిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సాయం చేయడానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు. సుమారు 15 నిమిషాల పాటు మోహన్‌బాబు.. జర్నలిస్టు రంజిత్ వద్ద ఉన్నారు.



రంజిత్ కుటుంబసభ్యులతో మంచు కుటుంబం

విష్ణు అనుచరులతో ప్రాణహాని ఉంది

▸ జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు: మంచు మనోజ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచు మోహన్‌బాబు కుటుంబంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ మధ్య మళ్లీ విభేదాలు భగ్గుమన్నాయి. జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్‌ను పోసి విద్యుత్తు సరఫరా నిలిపివేయడం ద్వారా విష్ణు అనుచరులు నన్ను, నా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారని మంచు మనోజ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. "నన్ను, నా కుటుంబాన్ని మంచు విష్ణు, అతడి అనుచరులు పలు విధాలుగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శనివారం నేను షూటింగ్‌కు వెళ్లగా.. నా భార్య కుమారుడి స్కూల్‌లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లారు. మా అమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ ఇచ్చే నెపంతో మంచు విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కందూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్లు ఇంటికి వచ్చారు. ఈ సమయంలో వారు నా జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు. దీని కారణంగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయంతోపాటు జనరేటర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. జనరేటర్‌కు సమీపంలోనే కార్లు, గ్యాస్‌కు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. ఒకవేళ నిప్పురవ్వల కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటే ఇంట్లో ఉన్న నా 9 నెలల పాప, వృద్ధురాలైన నా తల్లి, అంకుల్, ఆంటీల ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. మా అమ్మ పుట్టిన రోజున ఇలా జరగడం నా మనసును కలిచివేసింది. ఇది పూర్తిగా కుటుంబ సమస్య.. కానీ నా కుటుంబ క్షేమం, రక్షణ కోసం అన్ని అంశాలను బహిరంగపర్చాల్సి వస్తోంది. నేడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా" అని పేర్కొన్నారు.

వెంటిలేటర్‌పైనే శ్రీతేజ

▸ బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి ఇవ్వాలి: మంద కృష్ణ

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజకు ఇంకా వెంటిలేషన్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడిల్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజకు అందిస్తున్న చికిత, అతడి ఆరోగ్యస్థితిపై ఆదివారం సాయంత్రం ఆస్పత్రి హెల్త్‌బులిటెన్ విడుదల చేసింది. ఆస్పత్రిలో బాబుకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో చికిత్స కొనసాగుతోందని వైద్యులు చేతన్ ఆర్. ముందాడ, విష్ణు తేజ్ తెలిపారు. శ్రీతేజ వైటల్ పారామీటర్స్ స్థిరంగా ఉన్నాయని, ట్యూబ్ ద్వారా ఇచ్చే ఆహారం బాగానే తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. జ్వరం వస్తోందని.. మెదడు, నాడి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని వివరించారు. నాడీ సంబంధిత ఆరోగ్య స్థితిని ఎప్పటపకప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా శ్రీతేజను పరామర్శించేందుకు ఆదివారం ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆస్పత్రికి వచ్చారు. అతడి ఆరోగ్యస్థితి గురించి వైద్యులను, బాలుడి తండ్రి భాస్కర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీతేజ కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీతేజను సినీ పరిశ్రమ, మా అసోసియేషన్ సభ్యులు కూడా ఆదుకోవాలని కోరారు. శ్రీతేజను పరామర్శించడానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి కూడా ఆస్పత్రికి వచ్చారు.



కిందపడిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల, ఇతర నేతలను పైకి లేవదీస్తున్న దృశ్యం

కౌడా చైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో అపశ్రుతి

▸ ఎక్కువ మంది ఎక్కడంతో కూలిన వేదిక

▸ ఇద్దరు ఎమ్మెల్యేలు సహా పలువురికి స్వల్ప గాయాలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. చైర్మన్‌గా జనసేన నేత తుమ్మల రామస్వామి(బాబు) ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా.. వేదిక పైకి ఎక్కువ మంది ఎక్కడంతో అకస్మాత్తుగా అది కుప్పకూలింది. దీంతో స్టేజీపై ఉన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, తుమ్మల రామస్వామితో సహా పలువురు కూటమి నాయకులు కింద పడిపోయారు. ఈ పరిణామంతో సభా ప్రాంగణంలో కొంత తొక్కిసలాట జరిగింది. పోలీసులు, భద్రతా సిబ్బంది, నాయకులు తేరుకుని కిందపడిన వారికి రక్షణ వలయంగా ఉండి.. పైకి లేపి సపర్యలు చేశారు. ఎమ్మెల్యే చినరాజప్ప కాలికి స్వల్ప గాయం కాగా, ఆయన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. యనమల ప్రమాణస్వీకారం వరకు ఉండకుండా మధ్యలోనే తన క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే నానాజీకి వీపు, తలకు దెబ్బలు తగిలాయి. అనంతరం నానాజీ అధ్యక్షతన మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా కౌడా చైర్మన్‌గా తుమ్మల రామస్వామితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కౌడా వైస్ చైర్‌పర్సన్, కమిషనర్ భావన, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

విడుదల తేదీ ఖరారు

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి నటిస్తున్న 50వ చిత్రం 'ఘాటి'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను పెంచేశారు. ఆదివారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదలవుతున్నట్లు ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అనుష్క లుక్‌ను ప్రజెంట్ చేస్తూ.. 'విక్టిమ్.. క్రిమినల్.. లెజెండ్' అని పేర్కొన్నారు. అనుకోని పరిస్థితుల్లో లోతైన సమస్యలో కూరుకుపోయిన ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి ..వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే కథాంశంగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది.





బిగ్‌బాస్ సీజన్ 8 గెలుపుగుర్రం నిఖిల్

ఒక టీవీ షో.. ప్రతి సంవత్సరం దాదాపు మూడు నెలల పాటు ప్రేక్షకులు టీవీలకు అతుక్కుపోయేలా చేస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రేక్షకులకు అంతులేని వినోదంతో పాటు మరిచిపోలేని జ్ఞాపకాల్ని పంచిన ఆ షో బిగ్‌బాస్. గత ఏడు సీజన్‌లు అందించిన వినోదానికి ఏ మాత్రం తగ్గకుండా సెప్టెంబర్ 1న మొదలైంది తెలుగు బిగ్‌బాస్ సీజన్ 8. 105 రోజుల పాటు ఆసక్తికరమైన మలుపులతో ప్రేక్షకులను విశేషంగా అలరించి.. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. బిగ్‌బాస్ సీజన్ 8 గేమ్ షో విజేత ఎవరో తెలిసిపోయింది. ఈ ఏడాది షో విన్నర్‌గా నిఖిల్‌ను వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్‌చరణ్.. విజేతకు ట్రోఫీతో పాటు రూ.55 లక్షల ప్రైజ్‌మనీ, మారుతీ సుజుకీ డాజ్లింగ్ డిజైర్ కారుని అందజేశారు. ఇప్పటివరకు జరిగిన అన్ని సీజన్ల కన్నా ఈ సీజన్ ప్రైజ్ మనీ ఎక్కువ కావడం విశేషం. విజేతకు చివరి వరకు గట్టి పోటీనిచ్చిన గౌతమ్‌కృష్ణ రన్నరప్‌గా మిగిలారు. టాప్ 5 కంటెస్టెంట్లుగా పోటీ చేసిన నబీల్, ప్రేరణ, అవినాశ్‌లకు ప్రేక్షకుల నుంచి వచ్చిన ఓట్ల ఆధారంగా వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాలు దక్కాయి. ఎలిమినేషన్ ప్రక్రియలో ఐదో స్థానంలో నిలిచిన అవినాశ్‌ను హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ .. నాలుగో స్థానంలో ఉన్న ప్రేరణను కన్నడ స్టార్ ఉపేంద్ర.. మూడో స్థానంలో మిగిలిన నబీల్‌ను విజయ్‌సేతుపతి, మంజు వారియర్ బయటకు తీసుకుని వచ్చారు.

నభానటేష్ స్టెప్పులు

ఈ ఏడాది గ్రాండ్ ఫినాలేలో హీరోయిన్ నభా నటేశ్ స్పెషల్ పర్ఫామెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'పుష్ప 2'లోని 'వస్తున్నాయ్ పీలింగ్స్' పాటతో పాటు మరికొన్ని సాంగ్స్‌కు స్టెప్పులేసి అలరించారు. పలువురు సినీతారలు తళుక్కుమనడం.. శ్రీకృష్ణ, గీతా మాధురి పాటల ప్రదర్శన... టాప్ 5 కంటెస్టెంట్స్ ఆటపాటలతో షో ఆకట్టుకుంది. నాగార్జున జరిపిన సరదా సంభాషణలు.. సీజన్ 8 హౌజ్‌ను చూపించి అందర్నీ గతంలోకి తీసుకెళ్లడం.. ఇలా ఫినాలే ఆరంభం నుంచి విన్నర్‌ని ప్రకటించేదాకా వరకు హౌజ్‌లో జరిగిన హంగామా అంతా ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది.

పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు

సీజన్ 7 ఫినాలే తర్వాత జరిగిన గొడవల్ని, అల్లర్లను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. ఈ ఏడాది అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అభిమానులు ఎవ్వరూ స్టూడియోస్‌కు రావొద్దని.. విజేతను ప్రకటించాక ఊరేగింపులు, ర్యాలీలు చేయొద్దని పోలీసులు సూచించారు.



సినీ ఫైనాన్సియర్ బంగారు బాబు (ఈ.వి.రాజారెడ్డి) తనయుడు క్రాంతి రెడ్డి నిశ్చితార్థం పారిశ్రామికవేత్త సీతారామిరెడ్డి కుమార్తె శిరీషతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి గ్రూప్స్ అధినేత వేమూరి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కథానాయిక కీర్తిసురేశ్ ఇటీవలే తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌ను పెళ్లాడిన విషయం తెలిసిందే. తొలుత ఈ నెల 12న గోవాలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో జరగ్గా, తర్వాత క్రైస్తవ సంప్రదాయాన్ని అనుసరించి వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఆ ఫొటోలను కీర్తిసురేశ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



శివకార్తికేయన్‌తో శ్రీలీల

తమిళ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. 'ఎస్కే 25' వర్కింగ్ టైటిల్. సుధాకొంగర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. జయం రవి, అథర్వ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శివకార్తికేయన్ ప్రతిభావంతుడైన నటుడు. ఆయనతో సినిమా చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా నిర్మిస్తున్నాం' అని చెప్పారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె. చంద్రన్.

గర్వంగా ఉంది



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్‌సేతుపతి నటించిన చిత్రం 'విడుదల 2'. గతేడాది రిలీజై విజయం సాధించిన 'విడుదల' పార్ట్ 1కు కొనసాగింపుగా ఇది తెరకెక్కింది. సూరి, మంజు వారియర్ కీలక పాత్రల్లో నటించారు. నిర్మాత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్‌సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాలో నటించినందుకు ఎంతో గర్వంగా ఉంది. నా సినిమాల్ని ఇంతలా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకుల సపోర్ట్‌కు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇళయరాజా అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రధానాకర్షణ. చిత్రం తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉన్న సినిమా" అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు.



శరవేగంగా చిత్రీకరణ


స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాల ఆధారంగా దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బాబు జగ్జీవన్ రామ్'. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రదీప్ దోనెపూడి. బాబు జగ్జీవన్ రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్ ఫిల్మ్‌ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం షూటింగ్ వివరాలను వివరించింది. చిత్రదర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'జగ్జీవన్ రామ్ సేవల గురించి ప్రేక్షకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జగ్జీవన్‌రామ్ వర్ధంతి అయిన జూలై 6న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

అందరికీ నచ్చుతుంది



కేవీజీ రాజు దర్శకత్వంలో లోకేశ్ బాబు దాసరి, శిరీష హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ఉల్లాసంగానే ఉత్సాహంగానే'. శ్రీ మైత్రీ క్రియేషన్స్ పతాకంపై యార్లగడ్డ ఉమామహేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఎండీ కలామ్, ఖదీర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కేవీజీ రాజు మాట్లాడుతూ' ఈ చిత్రంలో లోకేశ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. త్వరలో సాంగ్స్ ట్రైలర్ రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. నిర్మాత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ' ఒక మంచి లవ్ స్టోరీని తెరకెక్కించాం. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా' అని అన్నారు.

లైంగికంగా వేధించాడు





బాలీవుడ్ సంగీత దర్శకుడు రాజేశ్ రోషన్ తనను లైంగికంగా వేధించారని గాయని లగ్నజితా చక్రబర్తి ఆరోపించారు. సంగీత చర్చల కోసం తన ఇంటికి పిలిచిన రాజేశ్ రోషన్ అసభ్యకరంగా తాకారని ఆమె చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో లగ్నజితా మాట్లాడుతూ 'నేను ముంబైలో ఉన్న రోజుల్లో ఓ సారి రాజేశ్ రోషన్ పిలవడంతో వారి ఇంటికి వెళ్లాను. వాద్య పరికరాలతో నిండి ఉన్న గదిలోకి నన్ను తీసుకెళ్లి కూర్చోబెట్టారు. నాక్కొంచెం దూరంలో ఆయన కూర్చున్నారు. నేను ఫోన్ చూస్తుండగా, రాజేశ్ రోషన్ నెమ్మదిగా నా వైపు కదలడం గమనించాను. అతను ఏం చేస్తాడో చూద్దాం అని నేను గమనించనట్లే ఊరుకున్నాను. రాజేశ్ రోషన్ నా స్కర్ట్‌లోకి తన చేతులను దూర్చాడు. నేను వెంటనే తేరుకొని అక్కడ నుంచి బయటకు పరుగుతీశాను. జుగుప్సాకరమైన ఆ సంఘటన గురించి కెమెరా ముందు మాట్లాడలన్నా సిగ్గుగా ఉంది. మొదట దిగ్భ్రాంతికి గురయ్యాను. అయితే జరిగిన దాంట్లో నా తప్పేం లేదు, అతనిది దిగజారుడు వ్యక్తిత్వం అని అర్థం చేసుకొని, ఆ సంఘటన వల్ల క్షోభకు గురికాకుండా నన్ను నేను కాపాడుకున్నాను' అని తెలిపారు. లగ్నజితా ఆరోపణలపై రాజేశ్ రోషన్ స్పందించలేదు.

క్రీడాకారుల ఎంపిక



బాక్సింగ్‌కు ఎంపికైన క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

ఎచ్చెర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్ వర్సిటీ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఆదివారం అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున క్రీడాకారులను ఎంపిక చేశారు. పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి జనవరి 2 వరకు జరిగే బాక్సింగ్ పోటీలకు పి.జాన్, సీహెచ్.జ్ఞానేశ్వరరావు, వై.దిలీప్, పి.ప్రసాద్, చండీఘర్ యూనిర్సిటీలో ఫిబ్రవరి 14 నుంచి 20 వరకు జరిగే వుషు పోటీలకు ఎం.శిరీష, ఆర్.పావనిని ఎంపిక చేశారు. వీరిని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనితో పాటు రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అభినందించారు. వర్సిటీ ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని కోరారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



శ్రీచక్రాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 1001 శ్రీ చక్రాలకు భక్తులతో కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆదిత్యాలయంలో 'సహస్ర కలశ స్నపన'



సహస్ర కలశ స్నపన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో ఆదివారం ఉదయం సహస్ర కలశ స్నపన కార్యక్రమం జరిగింది. ఆలయ అనివెట్టి మండపంలో ఏర్పాటు చేసిన వెయ్యి కలశాలలో వివిధ నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలను నింపి ఆవాహన నిర్వహించారు. పవిత్ర ధను సంక్రమణం రోజు సోమవారం ఈ నీటితో స్వామివారి మూలవిరాట్‌ను అభిషేకం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ, నేతింటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ● స్వామివారి ఆలయంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు, అర్చకులు శివ పంచాయతన సహిత మహా లింగార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారికి సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

మహాలక్ష్మికి గంగా హారతి



అమ్మవారికి గంగా హారతి ఇస్తున్న దృశ్యం

కంచిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని కర్తలి గ్రామంలో కొలువైవున్న మహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం సాయంత్రం గంగా హారతి ఇచ్చారు. ఉదయం నుంచి సహస్రనామ పూజ, హోమాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గంగా హారతి కార్యక్రమంలో గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్కంఠగా చదరంగం పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

గుజరాతీపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నానుబాల వీధిలోని జిల్లా చెస్ అసోసియేషన్ శిక్షణ కేంద్రంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఆదివారం ఉత్కంఠగా సాగాయి. ఈ పోటీల్లో 11 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులతోపాటు వర్ధమాన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆరు రౌండ్ల పాటు జరిగిన పోటీల్లో కుప్పిలి సాయి వెంకట్ విజేతగా నిలిచాడు. ద్వితీయ స్థానంలో చంద్రమౌళి, తృతీయ స్థానంలో యశ్వంత్, తరువాత స్థానాల్లో లక్ష్మణ్, వెంకట్, చిట్టిబాబు నిలిచారు. జూనియర్ విభాగంలో బగాది కార్తికేయ (ప్రథమ), శృతి (ద్వితీయ), రితిక్ నాయుడు (తృతీయ) స్థానాలు సొంతం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటర్‌గా పిడే ఆర్బిటర్ సనపల భీమారావు వ్యవహరించారు.

సందడిగా రహగిరి ఉత్సవాలు



అమ్మవారి ఊరేగింపు

పర్లాకిమిడి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజువీధిలో రహగిరి ఉత్సవాలను సందడిగా నిర్వహించారు. ఈ నెల 18నుంచి జరగనున్న గజపతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక కళాకారులు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ నిర్మలశెట్టి కళాకారులతో కలసి నృత్యం చేసి అలరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కరువై.. ఆహ్లాదం దూరమై..

● అధ్వానంగా గాంధీ పార్కు ● ధ్వంసమైన ఆట పరికరాలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పర్యాటకులతో ఆ పార్కు కళకళలాడేది. సెలవు రోజుల్లో అధిక సంఖ్యలో తమ కుటుంబాలతో పర్యాటకులు వచ్చి సందడి చేసేవారు. ప్రస్తుతం సౌకర్యాలు లేమితో కళావిహీనంగా మారింది. ఎటు చేసినా ధ్వంసమైన ఆట వస్తువులు, పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ పార్కును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో పార్కు అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఫలితంగా పార్కు ఆదరణ కోల్పోతుంది. శ్రీకాకుళం నగర ప్రజల కోసం దశాబ్దాల కిందట నగర నడిబొడ్డున గాంధీ పార్కును ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎందరో పర్యాటకులు వచ్చేవారు. 2004లో ఈ పార్కు అభివృద్ధికి అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాధాకృష్ణ విగ్రహం, వాటర్ ఫాల్స్ ఫౌంటెన్ వంటివి ఏర్పాటు చేశారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఈ పార్కు అభివృద్ధిని మరిచాయి. దీంతో రూపురేఖలు మారిపోయాయి. ఫౌంటైన్ శిథిలావస్థకు చేరింది. పొట్టి శ్రీరాములు విగ్రహం రూపం కోల్పోయింది. పార్కులోని శ్రీకృష్ణ బృందావనంలో ఏర్పాటు చేసి నెమళ్లు, జింకలు, తదితర జంతు, పక్షుల బొమ్మలు కూడా శిథిలమైన పట్టించుకునే నాథుడు లేడు. ఊయల బల్లలు, జారుడు బల్లలు విరిగిపోయాయి. విద్యుత్ దీపాలు వెలగక రాత్రుళ్లు అంధకారం నెలకొంటుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి పార్కును అభివృద్ధి చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



గాంధీ పార్కు







విరిగిపోయిన జారుడు బల్లలు, ఆట వస్తువులు



ఫౌంటైన్ ఇలా..

మహిళలను ప్రోత్సహిస్తాం

● ఎమ్మెల్యే కూన రవికుమార్



మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి (ఆమదాలవలస), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పురపాలక సంఘం పరిధి 10వ వార్డు మెట్టక్కివలస హడ్కో కాలనీలో ఆదివారం ఐసీడబ్ల్యూడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తగిన ప్రణాళికలు రచిస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీడబ్ల్యూడీఎస్ రాష్ట్ర పీడీ శ్రీనివాసరావు, ఎస్ఎస్ మార్డ్ ఎంపీ గోవిందరాజులు, ఐసీడబ్ల్యూడీఎస్ డైరెక్టర్ సాయికుమార్, ఎం.ధనలక్ష్మి, నాయకులు బోర గోవిందరావు, ఎన్.మురళీధర్, చిరంజీవి, రాడ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే అశోక్



ఎమ్మెల్యే అశోక్‌ని సన్మానిస్తున్న దృశ్యం

కవిటి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కవిటి గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. ఆదివారం కవిటి సామాజిక భవనంలో ఎమ్మెల్యే అశోక్‌ను అగ్నికుల క్షత్రియులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీకి మద్దతుగా నిలవడమే కాక, వ్యక్తిగతంగా తనను ఆదరించిన అగ్నికుల క్షత్రియులకు అన్నివిధాలుగా సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ, టీడీపీ నాయకులు పి.లక్ష్మణమూర్తి, బి.రమేష్, ఎ.మధు, బి.కామరాజు, జి.రామారావు, బి.తిరుమలరావు, ఎస్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పోరాటం ఆదర్శం: ఎంజీఆర్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం/పలాస, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట పటిమ నేటితరానికి ఆదర్శమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, నేతలు మంచు కృష్ణారావు, నందిగామ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. ● శ్రీకాకుళం క్రైం (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ మహేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ ఎల్.శేషాద్రి, సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగిస్తే బతికేదెలా?

● వెంటనే అందరినీ విధుల్లోకి తీసుకోవాలి

● ఏపీ హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయిస్ యూనియన్



మాట్లాడుతున్న యూనియన్ ప్రతినిధులు

అరసవల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్యశాఖలో 22 ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ(మేల్) విధుల నుంచి తొలగించడం సమంజసం కాదని, 920 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో జారీచేసిన నోటిఫికేషన్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి, మెరిట్ లిస్టు తయారుచేసి, కోర్టు ఉత్తర్వుల మేరకు 2003లో 2,321 మందిని ఒప్పంద ఉద్యోగులుగా నియమించినట్లు తెలిపారు. తరువాత ప్రభుత్వం తొమ్మిదేళ్ల సర్వీసు అనంతరం 1200 మందిని తొలగించిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో మరలా విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అనేక కారణాలతో 1207 జీవో ద్వారా నియమితులైన 1200 మందిని 22 ఏళ్ల సర్వీసు తర్వాత కూడా అధికారులు పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వ అధికారులు 22 ఏళ్ల సర్వీసు అనంతరం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కోర్టు తీర్పును ఆన్‌లైన్‌లో చూసి ఈ నెల 6వ తేదీన తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారని, ఇది అత్యంత బాధాకరమని అన్నారు. ఇప్పుడు బతికేదెలా అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి 1207 జీవోలో ఉన్న 920 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు.

సిక్కోలు రైతుకు అవార్డు



అవార్డుతో దుర్గారావు

ఆమదాలవలస, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతున్న ఆర్గానిక్ మేళా కార్యక్రమంలో మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన ప్రకృతి సేద్యపు రైతు నక్క చిరంజీవికి ఉత్తమ అవార్డు లభించినట్లు డీపీఎం రేవతి తెలిపారు. ఈ సందర్భంగా రైతు చిరంజీవి మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పారు. విపరీతంగా ఎరువులు వాడకంతో నేడు ఆహారం పూర్తిగా కలుషితమై, ప్రజలు తీవ్ర రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తాను ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని, అందరూ ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, మార్కెటింగ్ సిబ్బంది ఏ.శివాజీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

గుజరాతీపేట, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంపాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఉపాధ్యాయ సమస్యలపై పూర్తిస్థాయిలో పోరాటం సాగించానని, ఒక్క అవకాశం ఇచ్చి తనను గెలిపించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల దుర్గారావు ఉపాధ్యాయులను కోరారు. నగరంలోని ఇల్లిసపురం అంబేడ్కర్ విజ్ఞాన్ మందిరంలో ఆదివారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గంజి ఆర్.ఎజ్రా, దండాసి రాంబాబు, అంపోలు ప్రతాప్, శీర రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుప్పావై ప్రవచనం

గార, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ప్రసిద్ధ శ్రీకూర్మ క్షేత్రంలో సోమవారం నుంచి జనవరి 14 వరకు తిరుప్పావై ప్రవచనం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధం ప్రాజెక్టు వారి సౌజన్యంతో ఈ క్షేత్రం స్థానాచార్యులు శ్రీభాశ్యం పద్మనాభాచార్యులుతో తిరుప్పావై ప్రవచనం జరగనుందని చెప్పారు. ఈ నెల రోజులు సాయంత్రం 6 గంటలకు ఈ ప్రవచనం ఉంటుందని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

జి.సిగడాం/గార, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరాల్లో సోమవారం నుంచి నాలుగు రోజులు పాటు మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జి.సిగడాం, గార ఎంపీడీవోలు గుంటముక్కల రామకృష్ణ, ఎస్.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సర్పంచ్‌లు, మండల అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు, 17న గ్రామ సర్వేయర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ పశువైద్య అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, విద్యుత్ సిబ్బందికి, 18, 19న డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ అందిస్తామని తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఐస్ స్కేటింగ్ దినోత్సవం



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

సోంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోంపేటలోని ధ్యాన్‌చంద్ స్పీడ్ స్కేటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్నేషనల్ ఐస్ స్కేటింగ్ దినోత్సవం నిర్వహించారు. సోంపేట, పలాసకు చెందిన 40 మంది చిన్నారులు స్కేటింగ్‌లో పాల్గొన్నారు. కోచ్ ధ్యాన్‌చంద్, తెలుకల అచ్యుత్, బీన ఈశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

సోంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తుంగాన వెంకటేష్, దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, బీన ఆనందరావు, బల్ల జానకిరావు ఉన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

కంచిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతి సందర్భంగా మఖరాంపురం షిరిడీ సాయి దేవాలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బెందాళం రమణసాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అన్న సంతర్పణ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర కొలువులకు ఎంపిక

జి.సిగడాం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట గ్రామానికి చెందిన మీసాల శివప్రసాద్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా, మక్క రమణమ్మ ఐటీబీపీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దీంతో వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు, తోటి మిత్రులు అభినందలు తెలిపారు.

క్రైం కార్నర్

ఇందిరానగర్ చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

● మరో ఐదుగురి కోసం పోలీసుల అన్వేషణ

నరసన్నపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరు 3న ఇందిరానగర్‌లో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న దంత వైద్యుడు గురుదేవ్ ఇంట్లో చోరీ ఘటనలో ఇద్దరిని ఆదివారం జమ్ము జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత ఏడాది సుమారు వంద తులాలు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ కేసులో సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం అనుమానాస్పదంగా జమ్ము జంక్షన్ వద్ద తిరుగుతున్న మధ్యప్రదేశ్, ధార్ జిల్లా నౌరోలీ గ్రామానికి చెందిన సోహన్ దావర్, అలీధర్ పూర్ జిల్లా బెడకత్వాల్ గ్రామానికి చెందిన సకోడియా చాగల్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి 10 తులాలు వెండి, రెండు గ్రాముల బంగారం, 60 గ్రాములు వెండి, తులం నక్లీసు, 10 తులాలు వెండి ప్లేటు, 1.5 గ్రాముల బంగారం కాయిన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ తెలిపారు. వీరికోసం అన్వేషిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై విజయనగరంలో ఐదు, మండపేటలో ఒకటి, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు ఉన్నట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్‌జీఆర్‌పురంలో భూ వివాదం

● ఇరువర్గాల కొట్లాట ● 32 మందిపై కేసు నమోదు



గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు పహారా

రణస్థలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌జీఆర్‌పురం గ్రామంలో భూ వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పలువురికి గాయాలు అయ్యాయి. పోలీస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సీహెచ్ రామారావు తన భూమిని వేరే వ్యక్తికి విక్రయించాడు. అయితే వారసురాలినైన తన సంతకం లేకుండా, భూమిని తన తండ్రి ఎలా విక్రయిస్తాడని కుమార్తె ధనలక్ష్మి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని రెడ్ మార్కులో పెట్టారు. దీనిపై గత కొద్దిరోజులుగా వివాదం జరుగుతోంది. ఇది చిలికిచిలికి గాలివానల మారి ఆదివారం కొట్లాటకు దారితీసింది. తనపై ఉప్పాడ అప్పన్న, కె.అప్పన్నతో పాటు మరో 12 మంది దాడి చేశారని చీకటి రాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై కర్లయ్య, పున్నంతో పాటు మరో 20 మంది దాడి చేసినట్లు మరో వర్గానికి చెందిన కె.అప్పన్న ఫిర్యాదు చేశాడు. గాయపడిన వారు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రణస్థలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పైడిపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో వల్లభరావుపేటకు చెందిన డి.సూర్యనారాయణ (58) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కోష్ట నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సూర్యనారాయణ పైడిపేట సమీపంలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

ఎచ్చెర్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అజ్జరాం గ్రామానికి చెందిన బోర ఈశ్వరరావు (50) అనే వ్యక్తి ఆదివారం గ్రామ సమీపంలోని తోటల్లో అనుమానస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈశ్వరరావు తన పశువుల కోసం గడ్డి తెచ్చేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. గడ్డిని కావడిపై తీసుకువస్తుండగా, గ్రామానికి ఒక కిలో మీటరు దూరంలో ఆయన విగతజీవిగా పడి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద పురుగు మందు సీసాను పోలీసులు గుర్తించారు. ఆధ్యాత్మిక చింతన గల ఈశ్వరరావు ప్రతి ఏటా తిరుపతిలోని వేంకటేశ్వర స్వామిని దర్శించేందుకు సైకిల్‌పై వెళ్తుండేవాడు. గ్రామంలో ఎవరితోనూ ఎలాంటి గొడవలు గాని, కుటుంబంలో కూడా ఎలాంటి తగాదాలు గాని లేవని గ్రామస్థులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వ జనాసుపత్రికి తరలించారు. మృతుని భార్య తవిటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సోమేష్, హేమంత్, రాహుల్

కాశీబుగ్గ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ (జీడీ) కానిస్టేబుల్ తుది ఫలితాల్లో జగన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం విద్యార్థులను సెంటర్ డైరెక్టర్ మద్దిలి జగన్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగువాడకు చెందిన పి.సోమేష్, కొత్త పారసాంబకు చెందిన హేమంత్, రాహుల్ ఎస్ఎస్‌సీకి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. హేమంత్ ఐటీబీపీ, సోమేష్, రాహుల్ ఎస్ఎస్ఎస్ఎం రైఫిల్స్ ఉద్యోగాలు సంపాదించారన్నారు.

ఘనంగా బాలల క్రిస్మస్



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బాలలు

పలాస, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నబడాం క్రిస్టియన్ ప్రార్థనా మందిరంలో బాలల క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాజమండ్రికి చెందిన ప్రశాంత్‌కుమార్ హలోనెను దంపతులు పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవాళిని రక్షించేందుకు క్రీస్తు భూమి మీదకు వచ్చారన్నారు. బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్, పాస్టర్ రాజు, జాన్‌డేవిడ్, దానియల్, ప్రభుదాస్, జాయ్‌ప్రసాద్, ఇస్రాయల్, సుందరరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు

ఇచ్ఛాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ హెచ్‌సీ తెలకల రామారావు 50 మంది నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పట్టణ పరిధిలోని పేదలతో పాటు ధనరాజ తులసమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న సాధువులకు దుప్పట్లు అందజేశారు.

నిర్మించి.. వదిలేశారు!

● ఇరుకు గదుల్లో ఇబ్బందులు
● ఇదీ ఆర్బీకే, సచివాలయం, ఉపాధి కార్యాలయాల తీరు

పోలాకి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తరేవులో మూడు శాఖల కార్యాలయాలను ఒకే ప్రాంగణంలో వైసీపీ హయాంలో నిర్మించారు. సుమారు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలను అప్పటి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించినా నేటికీ ఆ భవనాల్లో విధులు నిర్వహించక పోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా సచివాలయంలో విధుల నిర్వహణకు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్బీకే, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభించి 16 నెలలైనా కాంట్రాక్టర్ బిల్లులు రాకపోవడంతో ఇంత వరకు అప్పగించలేదని తెలిసింది. ఈ నేపథ్యం లో ఇరుకుగా ఉన్న శిథిల భవనంలోనే సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తు న్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శి రత్నాకర్‌ను వివరణ కోరగా సచివాలయ భవనాలు ప్రారంభించిన మాట వాస్తవమని, కాని విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించలేదన్నా రు. ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేయలేదని, దీంతో కాంట్రాక్టర్ భవనాలను అప్పగించలేదని, ఎంపీడీవో దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.



కొత్తరేవులో నిర్మించిన భవనాలు..

స్తంభాలు విరిగి.. గజాలు తుప్పుపట్టి

● శిథిలావస్థకు చేరిన వలల అల్లుకునే భవనం

గార, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బందరువానిపేటలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన మత్స్యకారులు వలలు అల్లుకునే భవనం శిథిలావస్థకు చేరింది. ప్రధానంగా సముద్రతీరంలో అతిపెద్ద మత్స్యకారుల గ్రామం కావడంతో ఇక్కడ అవసరాల దృష్ట్యా భవనం నిర్మించారు. తర్వాత కాలంలో నిర్వహణకు నోచుకోకపోవడంతోపాటు సముద్రం ఉప్పు గాలికి త్వరగా భవనం స్తంభాలు విరిగిపోయాయి. శ్లాబ్‌కు ఉన్న గజాలు తుప్పు పట్టిపోవడంతో బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ఏ క్షణంలో భవనంపై భాగం నుంచి పెచ్చులు ఊడి పడతాయోనని భయాందోళనతో మత్స్యకారులు ఇందులో వలలు అల్లుకోవ డానికి ముందుకు రావడం లేదు. తక్షణమే కూటమి ప్రభుత్వం నూతన భవనం నిర్మిం చాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు. కాగా వలలు అల్లుకునే భవనం శిథిలావస్థకు చేరుకో వడాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకువెళ్లి నట్లు బందరువానిపేట మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు పుక్కళ్ల సూర్యనారాయణ తెలిపారు. నూతన భవనం మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.



శిథిల దశకు చేరుకున్న మత్స్యకారులు భవనం

భక్తి మార్గమే ముక్తికి సోపానం



భక్తి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న స్వామి స్వసంవేద్యానందజీ

పలాస, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడిచి ముక్తి పొందాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి స్వసంవేద్యా నందజీ అన్నారు. ఆదివారం ఉత్తరాంధ్ర రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం ముగింపు సభ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల రోడ్డులో నిర్వహించారు. స్వామి వివేకానంద బోధనలు ఆచరించి సన్మార్గంలో పయనించాలన్నారు. కోర్కెలను అదుపు లోకి పెట్టుకోవాలన్నారు. 'ప్రాపంచక విధులు-ఆధ్యాత్మిక జీవితం'పై ప్రసంగించారు. కార్యక్రమంలో హృదానందజీ, జయగోపాలనందజీ, దుర్గాప్రసాద్ పాత్రో, నాగరాణి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

పలాస/కాశీబుగ్గ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీ నెమలికొండ శాంతి ఆశ్రమంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేనికి వివిధ రకాలపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. రాధా మనోహర్ స్వామి ఆధ్యాత్మిక ప్రవచ నం చేశారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, జిల్లా రజక సాధికార కమిటి కన్వీనర్ కొవ్వూరు సురేష్‌కుమార్, జీవన్, గురువు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● నందిగాం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో దత్త జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నందిగాం షిరిడీసాయి ధ్యానమందిరం, కాపుతెంబూరు దత్త ఆశ్రమంలో శాస్త్రోక్తంగా చేప ట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేపట్టారు. పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు

పోలీసులు, టీడీపీ నేతలే కిడ్నాప్ చేశారు

● ఆందోళనకు దిగిన మాజీ మంత్రి అప్పలరాజు

పలాస,డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీసులు, టీడీపీ నేతలు కలిసి చినబాడం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు కూర్మాపు ధర్మారావు, అంపోలు శ్రీనును కిడ్నాప్ చేశారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి రాత్రి 10గంటల సమయంలో బైఠాయించారు. కొందరు వ్యక్తులు ఆదివారం రాత్రి 8 గంటలకు వచ్చి డీఎస్పీ పిలుస్తున్నారని చెప్పి కూర్మాపు ధర్మారావు, అంపోలు శ్రీనులను బయటకు తీసుకెళ్లారని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఈ సంఘటన నేపథ్యంలో పోలీసులకు, టీడీపీ నాయకులకు వ్యతిరేకంగా అప్పలరాజు నినాదాలు చేశారు. ఈ ఘటనపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. పోలీసులు చెప్పుడు మాటలు విని తమ వాళ్లను అరెస్టు చేయడం సరికాదని, ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. పోలీసులు తీసుకెళ్లిన వారిని ఇప్పటికైనా విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో బైఠాయించిన అప్పలరాజు

22న సుబ్బారావు పాణిగ్రాహి స్మారక సభ

పలాసరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళ సాయుధ పోరాటంలో వీరోచిత పోరాటం చేసిన వ్యక్తి సుబ్బారావు పాణిగ్రాహి అని వక్తలు అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఆదివారం సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సందర్భంగా 22న నిర్వహించనున్న స్మారక సభ కర పత్రాలను ఆవిష్కరించారు. 'పాణిగ్రాహి-పోరాట జీవితం-వర్తమాన ప్రాసంగికత-ప్రాధాన్యం' అనే అంశంపై సభ నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎంఎస్ సంఘం సభ్యులు తాండ్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్ తెలిపారు. సాయుధ పోరాటంలో సుబ్బారావు పాణిగ్రాహి చూపిన తెగువ మరువలేనిదని, ఆయన మాటా, పాటా తూటాలై పేలి విప్లవ పోరాటంలో చరిత్రగా నిలిచిందన్నారు. స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కుసుమ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కన్వీనర్ సార జగన్, కుత్తుమ హేమక్క, బర్ల జానకమ్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు బర్ల గోపి, పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

హరిపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతి సందర్భంగా హరిపురం ఇస్కాన్ హరేరామ, హరేకృష్ణ ప్రతినిధులు ఆదివారం సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు కొర్ల కన్నారావు ఆధ్వర్యంలో నామమాత్రపు రుసుంతో భగవద్గీత, రామాయణం గ్రంథాల విక్రయశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కె.సురేష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ షేక్ షబ్జీకి నివాళి

టెక్కలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ షేక్‌షబ్జీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఇందిరాగాంధీ కూడలిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి.శ్రీరామ్మూర్తి, కె.దాలయ్య, వైకుంఠరావు, కుమారస్వామి, పాపారావు, దుర్గారావు, అప్పలస్వామి, ధర్మారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరునికి ఏకాంత సేవ



జలుమూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామికి ఆదివారం అర్చకులు ఏకాంత సేవ నిర్వహించారు. మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉదయం స్వామికి సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పార్వతీ పరమమేశ్వరులకు ఏకాంత సేవ నిర్వహించి జోల పాటలు పాడారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

జలుమూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిలారు రైల్వే గేటు వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. నారాయణవలస సంత నుంచి సూర్యారావు పేట కబేళాలకు తరలిస్తున్న పశువుల లారీని సీజ్ చేసినట్లు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న 8 ఎద్దులు, ఒక ఆవును రణస్థలం గో శాలకు తరలించామన్నారు. పశువులను అక్రమంగా త్వరలిస్తున్న డ్రైవరు కమ్ యజమాని బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలానికి చెందిన చింతల పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనంలో కిక్కిరిసి ఉన్న పశువులు



తీరంలో పర్యాటకుల సందడి



వజ్రపుకొత్తూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఉదయం నుంచే తీరానికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకొని వనభోజనాలు చేశారు. మధ్యాహ్నం సముద్రం తీరానికి వెళ్లి స్నానాలు చేసి ఆనందం పొందారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తోటూరు, వజ్రపుకొత్తూరు, కొత్తపేట, దేవునల్తాడ తీరాలలో కూడా పర్యాటకులు సందడి చేశారు.

పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాకివలస ఉన్నత పాఠశాల ఆవరణలోకిల్లాం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ధర్మాన సూర్యనారాయణ సరస్వతీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యాళ్ల వేణుగోపాలరావు, శిమ్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గా భవానీల కలశపూజ



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న గురుభవానీలు

పోలాకి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి దుర్గాగిరి అమ్మవారి సన్నిధిలో ఆదివారం మాలధారణ చేసిన దుర్గాభవానీలంతా కలశపూజ చేశారు. గురుభవానీ పల్లిరాజు, చిరంజీవులు ఆధ్వర్యంలో కలశ పూజ అనంతరం దుర్గాకాలనీ, దీర్ఘాశి, కాలనీ పురవీధుల్లో మహిళలు కలశలు, భవానీలు నూనెదీపాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, స్వయంశక్తి సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పక్షుల విహార కేంద్రాన్ని రక్షించాలి

టెక్కలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తేలినీలాపురంలోని విదేశీపక్షుల విహార కేంద్రాన్ని రక్షించాలని జనవిజ్ఞాన వేదిక ఉత్తరాంధ్ర పర్యావరణ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం ఈ కేంద్రాన్ని సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడే దిశగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, రాష్ట్ర నాయకులు కె.రామారావు, కె.సత్యనారాయణ, త్రిమూర్తులు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

టెక్కలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎస్‌డీఅండ్‌టీ విభాగం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు బయోడేటా, అర్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ పి.రమేష్ 94932 90012 నెంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆక్రమణల తొలగింపు

పలాస, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పారిశ్రామికవాడ రోడ్డులో ఆక్రమణలను కమిషనర్ రామారావు ఆధ్వర్యంలో ఆదివారం తొలగించారు. ఆక్రమణల చెరలో ఉన్న భూములు గుర్తించి మున సిపల్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కన్నులపండువగా కొండమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

పలాస, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూదికొండపై వెలసిన కొండమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. మాజీ మంత్రి, సీనియర్ టీడీపీ నాయకుడు గౌతు శ్యామసుందర శివాజీ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, దడియాల నర్సింహులు, సవర రాంబాబు, బద్రి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

పోలాకి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ మందిరం, వెలుగు కార్యాలయాల్లో సోమ, మంగళ వారాల్లో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రవికుమార్, సూపరింటెండెంట్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని వారు కోరారు.

● కోటబొమ్మాళి డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులకు సోమ, మంగళవారాల్లో వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించి కార్యదర్శులు అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

పలాసలో రేపటి నుంచి..

పలాసరూరల్,డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో గ్రామ సచివాలయ సిబ్బంది, సర్పంచ్, మండల స్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఎస్.వసంత్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

అనర్హుల పేర్లను తొలగించండి

పాతపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మిక సంఘంలోని అనర్హుల పేర్లను తొలగిం చాలని కొరసవాడ చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే మామిడి గోవింద రావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న చేనేత కార్మికులను సభ్యత్వలనుంచి తొలగించి అనర్హులను సభ్యులుగా చేర్చారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మంచు కృష్ణారావు తదితరులున్నారు.